# కనిపించని కన్నీళ్లు

— కాకాని కమల

ఏదో ఆ మూడుముళ్ళు వేయించగలిగాడు కానీ చాలా అవకతవకలు జరిగాయి.

ఇవ్వవలసిన కట్నం డబ్బు కాస్త బాకీ పడింది.

అప్పటినుంచి కూతురు పుట్టింట్లోనే వుంది. తల తాకట్టు పెట్టి అయినా బిడ్డని అత్తింటికి

తెల్లవారుజామున నాలుగు దాటుతోంది.

నిట్టాడిపాకకి పెడగా వున్న గొడ్లచావిడిలోంచి రాటకి కట్టేసి వున్న గోవు మాలచ్మి 'అంబా' అని ఆర్తనాదం చేస్తోంది.

ఆ అరుపుకి ఇంటి ముంగిట వసారాలో పడుకున్న సీతయ్య మనస్సు పెరపెరలాడింది.

కలతబారిన మనస్సుతో అశాంతిగా నులక మంచంలో పక్కకి వత్తిగిల్లాడు. 'అంబా' అన్న అరుపు అరుపులా కాక ఆర్తనాదంలా వినిపించింది సీతయ్య చెవులకు.

నోరులేని మూగజీవాలే అయినా వాటికి తగిన జ్ఞానం వుంది. పెంచిన మమకారం, యజమాని మీద ప్రేమ, వెన్నుకాసే విశ్వాసం వుంటాయి.

తెల్లారితే జరిగేదేమిటో మాలచ్మికి తెల్సిపోయి వుండాలి. అందుకనేమో రాత్రంతా 'అంబా అంబా' అని అరుస్తూ నిద్రపట్టకుండా చేసింది అనుకున్నాడు సీతయ్య.

"మరి మాలచ్మితో అనుబంధం ఈనాటిదా! దీని తల్లి, అమ్మమ్మ ఇక్కడ పుట్టి పెరిగాయి. మాలచ్మి తన ఇంటి వంశపారంపరిగా వచ్చిన గోమాత. కానీ ఇంక ఆ రుణం తీరిపోయింది" సీతయ్య మనస్సు బాధగా మూల్గింది.

సీతయ్య ముగ్గురు ఆడపిల్లల పెళ్లిళ్లు చేసి ఇద్దరు కొడుకుల్ని సిటీలో పెద్ద చదువుల్లో పెట్టేసరికి పంచపాళీతోవున్న పెంకుటిల్లు నిట్టాడి పాకగా మారింది. ఆరు ఎకరాల మాగాణి నాలుగు చెక్కల మడిగా నా వాటాగా మిగిలింది. స్వంత వ్యవసాయం పోయి కూరగాయలు పండించే స్థితికి వచ్చాడు.

అవడానికి కాడి ఎడ్ల భుజాల్లా ఇద్దరు మగపిల్లగాళ్లున్నా ఇంకా పట్నంలో వాళ్ల చదువు మూడేళ్లుంది. ఒకడు డాక్టరు, ఇంకోడు ఇంజనీర్ కావాల్సిందేనని పెండ్లాం శపథం పట్టింది.

కొడుకులిద్దరూ తల్లి వెనుక చేరారు.

దాంతో తప్పనిసరై దొనేషన్లు కట్టి పట్నంలో ఒకడ్ని డాక్టర్ కోర్సులోను, ఇంకోడ్ని ఇంజనీరింగ్ లోనూ చేర్పించేసరికి సీతయ్యకి కళ్ల వప్పబడి పెద్దలు కనిపించారు.

పై ఇద్దరి కూతుళ్ల పెళ్లి బాగానే జరిపించాడు.

కానీ ఏడాదిక్రితం జరిగిన ఆఖరి కూతురి పెళ్లి జరిపించేవేళకి పరిస్థితులు తారుమారు అయ్యాయి.

పంపమని ఇరుగూపొరుగూ సలహా ఇస్తున్నారు.

"ఇల్లు, పొలం పోయిందని దిగులెందుకు పడతావ్ సీతయ్యా. ఆడపిల్లలకి పెళ్లిళ్లు చేసావ్. నీ కొడుకులిద్దరూ పెద్ద చదువులుచదువుతున్నారు. ఆళ్ల ఉద్యోగాలమీదకెక్కి ఇంతకి నాలుగింతలు సంపాదించరా! మన చుట్టుపక్కల గ్రామాల్లో డాక్టర్ చదివినవాళ్లు ఎవరున్నారని! నీ కొడుకు బోర్డు కడితే కుప్పలు కుప్పలు జనం రారూ! ఇవాళ రేపు రోగాలులేంది ఎవరికి!" అని ఓదారుస్తున్నారు.

నిజమే కావచ్చు.

కానీ అంతవరకూ అవసరాలు గడిచేదెట్లా!

ఇంకో పదిరోజుల్లో సంక్రాంతి పండుగ వుంది.

అల్లుళ్ల పండుగ.

పెళ్లి అయ్యాక వచ్చే మొదటి పండుగ. అల్లుడ్ని పిలవాలి. ఘనంగా పండుగ జరిపించాలి. వియ్యపురాలు కోపంతో వుంది. ఆవిడకి శాంతి జరిపించాలి. బాకీపడ్డ కట్నం చెల్లు చేయాలి. పెళ్లిలో అలకపాన్పు మీద అల్లుడు స్కూటర్ కోరాడు.

అల్లుడ్ని పండక్కి పిలవడం అంటే ఇవన్ని జమ చేయాలి.

"భగవంతుడా!" అనుకున్నాడు సీతయ్య.

పెళ్లయినా సౌభాగ్యం లేకుండా పుట్టిల్లు చేరిన కూతుర్ని చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది.

ఆఖరికి విధిలేక షావుకారు దగ్గిర పాత అప్పుకి మరికొంత జమచేస్తూ వడ్డికి డబ్బు తెచ్చాడు.

కాని వడ్డీకి భయపడి అవసరానికి సరిపడా తేలేదు. ఇంకా కొంచెం తక్కువ పడుతుంది.

ఆ తరువాత ఎలా జమ చేయాలో తోచడంలేదు.

ఇంకా కొడుకులు చదువులు పూర్తి అవలేదు. నెలనెలా వాళ్లకి డబ్బు పంపాలి.

అందుకే ఇంక వేరే దారిలేక పాడిఆవుని


ఇమ్మకానికి పెట్టాడు.

తన బిడ్డల్లానే తన వంశంతో అది రూ ఇంట పెరిగింది.

తన బిడ్డని అత్తింటికి పంపడం కోసం పాడిఆవుని పరాయి ఇంటికి పంపక తప్పడంలేదు.

గోవు మాలచ్మి రోజుకి పదిశేర్లపై చిలుకు పాలు ఇస్తుంది.

తన పెళ్ళాం జాగ్రత్తగా పాలమీద వెన్న



తీస్తుంది. పిడక చరిచి అమ్ముతుంది.

ఈ ఆదాయంతోనే ఇల్లు గడుస్తుంది.

గోవు మాలచ్మి అండ లేకపోతే చాలా కష్టం.

కానీ ఇంటి మాలక్ష్మి వంటి గోవు మాలచ్మి గొప్పది కాదా!

పెళ్లాం సలహా మీద ఆవుని పొరుగూరు ఆసామికి అమ్మేసాడు.

మెడమీద కత్తిలా పండుగ. అల్లుణ్ని పిలవాలి.

తప్పనిసరి అవసరం. లేకపోతే కూతురి కాపురం కూలిపోతుంది.

నిన్ననే ఆసామి వచ్చి ఆవును కొనుక్కుని, సొక్కం ఇచ్చి వెళ్లాడు.

కూతురు ఇంటి మాలచ్మి.

గోవు పాడి మాలచ్మి.

కూతురు సిరి ఇంటినుంచి తీసికెడుతుంది.

గోమాత సిరిని ఇంటికి తెస్తుంది.

నిజమే. మనిషికంటే జంతువే గొప్పది.

బంగారం పెట్టినా తృప్తిపడని మనిషికంటే, తన అల్లుడిలాంటి మనిషికంటే

గడ్డి పెడితే తృప్తిపడే జంతువు గొప్పది! దాని విశ్వాసం ఇంకా గొప్పది.

''అంబా...'' గోవు తల్లి మళ్లీ ఆర్తనాదం చేసింది.

తూరుపు తెల్లబారుతున్న కొద్దీ దాని ఆర్తనాదం ఎక్కువ అవుతోంది.

అంబా అంబా అని అదే పనిగా అరుస్తోంది.

ఆ అరుపు సీతయ్య గుండెని చీలుస్తోంది.

నిన్న డబ్బిస్తూ ఆసామి చెప్పిన మాట జ్ఞాపకం వస్తే సీతయ్య మనసు కళవెళ పడుతోంది.

''రేపు సూర్యోదయానికి ముందే మా పాలెగాణ్ని పంపుతాను. ఆవుని తోలియ్యి సీతయ్యన్నా'' అన్నాడు ఆవుని కొన్న పెద్దిరెడ్డి.

''అట్లే మంచిది'' అన్నాడు తను.

కానీ ఆవు తన గోలచ్మి తన ఇంటి గడప దాటడం తను చూడగలడా! అంబా అంబా అని దాని అరుపు తన గుండెని వ్రయ్యలు చేయదా!

''అంబా...''

సీతయ్య గభాల్న నులకమంచంలో లేచి కూర్చున్నాడు.

కూతుర్ని అత్తారింటికి పంపించిన రోజుకంటే ఎక్కువ బాధ అనిపిస్తోంది.

సీతయ్య మంచం కిందవున్న ముల్లుకర్ర అందుకున్నాడు.

ఇంటి ముంగిట వున్న వేపచెట్టు కొమ్మ వంచి 'ఒరే' అంటూ గడపలో నిల్చుని కేక పెట్టాడు.

చల్ల చిలుకుతున్న భార్య ఆదెమ్మ 'ఆ...' అంది.

''నే చెరువుకి పోతున్నా. పెద్దిరెడ్డి పాలెగాడు గనక వస్తే ఆవుని తోలియ్యి'' అంటూ ముల్లుగర్ర తాటించి పెద్ద పెద్ద అంగలు వేస్తూ వెళ్లిపోతున్న భర్తకి ''నువ్వు కూడా వుంటే బాగుంటుంది కదా'' అంటూ గడపదాకా వచ్చి ఏదో చెప్పబోయిన ఆదెమ్మ ముఖం చిన్నబుచ్చుకుని వెడుతున్న భర్తని చూసి ఏదో అర్థం అయినట్లు ఆగిపోయింది.

యజమానురాల్ని చూసి మళ్ళీ 'అంబా' అంది గోవు మాలచ్మి.

''నువ్వు అరుస్తున్నావు. నేను అరవడంలేదే అంతేనే తేడా'' అంటూ ఆదెమ్మ చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ పచ్చిగడ్డి ఆవు నోటికి అందించి ఆపేక్షగా దాని మెడ నిమురుతూ వుండిపోయింది.

ఆవు, ఆమె.

ఇరువురి కళ్లల్లో కనిపించని కన్నీళ్లు.

మూగవేదన!

*